క్లుప్తంగా

జాబ్ మేళా

ఖమ్మంరాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఎనిమిది మంది ఎంపికయ్యారు. అపోలో గ్రూప్‌లో వివిధ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహించగా.. 31 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో తొలిదశగా 16 మందిని ఎంపిక చేసి వడబోత అనంతరం ఎనిమిది మందికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్.ఆర్ కళాశాల లైబ్రరీ విభాగం ఆధ్వర్యాన మంగళవారం భారతదేశ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుస్తక పఠన ఆవశ్యకతను, జాతీయోద్యమ కాలంలో గ్రంథాలయోద్యమ పాత్రను, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.విజయకుమార్, అధ్యాపకులు చందా సుధాకర్ కె.రవికుమార్, సుజిత్‌రెడ్డి, కె.కార్తీక్, పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

ఖమ్మం అర్బన్: నగరంలోని వివిధ దేవాలయాల్లో మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందిరానగర్‌లోని శ్రీ బాలగణపతి ఆలయంలో అర్చకుడు గిరిధర్ ఆధ్వర్యాన పూజలు జరిపించగా..ఆలయ ఈఓ వీవీ నరసింహారావు, అధ్యక్షుడు బాజిన్ని వీరయ్య, కార్యదర్శి తిరుపతిరావు నేతృత్వాన భక్తులకు అల్పాహారాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే మధురానగర్ సాయిబాబా ఆలయం, టేకులపల్లి గోశాలలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా వేడుకలు నిర్వహించారు. పసుపులేటి సునీత, చైతన్య, ప్రవంతి, సుచరిత దాతలుగా పాల్గొని భక్తులకు అల్పాహారం వితరణ చేశారు.

ఆర్థిక సాయం అందజేత

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీను, రామసహాయం అరవింద్ రెడ్డి, కొప్పుల అశోక్, బోడా మంగీలాల్, ఉన్నం రాజశేఖర్, అంబేద్కర్, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు.

డెంగీ డేంజర్ బెల్స్



42వ డివిజన్‌లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

నగరంలో పెరుగుతున్న డెంగీ కేసులు

- గత 15రోజుల్లో 10 కేసులు నమోదు
- 21 హాట్‌స్పాట్ల గుర్తింపు
- తూతూమంత్రంగా పారిశుద్ధ్యంపై అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల కురిసిన వర్షాలతో ఖమ్మం నగరంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఓ పక్క వైరల్ ఫీవర్‌లు ఆందోళన కలిగిస్తుంటే.. మరోపక్క డెంగీ వంటి విషజ్వరాలు అటు అధికారులు, ఇటు ప్రజలను కలవరపెడుతున్నాయి. ఈ సీజన్ ప్రారంభంలోనే గత 15 రోజుల్లో 10 కేసులు నమోదు కావడంతో కేఎంసీ అధికారులతో పాటు ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై గత నాలుగేళ్ల కేసుల డేటా ఆధారంగా డెంగీ హాట్ స్పాట్‌లను గుర్తించారు.

15వ డివిజన్‌లోనే 5 కేసులు..

గత నెల 23వ తేదీ నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నగరంలో జరిపిన వైద్య పరీక్షల లెక్కల ప్రకారం.. నగరంలో 10 డెంగీ కేసులు నమోదయ్యాయి. వీటిలో ఐదు కేసులు ఒక్క 15వ డివిజన్ అల్లీపురం ప్రాంతంలో నమోదుకావడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ 15 రోజుల్లో నమోదైన కేసులను పరిశీలించడంతో పాటు అక్కడ డెంగీ కేసులు ఎందుకు వచ్చాయనే అంశాలను తెలుసుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత, పారిశుద్ధ్యం లోపం, నిల్వ నీరు వంటివి అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

అవగాహన, పారిశుద్ధ్యంతోనే..

వర్షాకాలం సీజన్ ప్రారంభం నాటి నుండే నగరంలో విష జ్వరాలు, డెంగీ జ్వరాలపై అధికారులు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి. గతంలో దోమలు పుట్టకుండా చేపట్టాల్సిన అంశాలపై కేఎంసీ అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో నగరమంతటా డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి, నిల్వ ఉన్న నీటిని తొలగింపజేశారు. గత నెల నుంచే వర్షాలు కురుస్తున్నా.. నగరంలో వీటిపై ఎక్కడా ప్రచారం చేసినట్లు కనిపించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు, పాలకులు తూతూ మంత్రంగానే ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఇక ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజల భాగస్వామ్యంతోనే దోమలు పట్టకుండా అడ్డుకోగలమని అధికారులు పేర్కొంటుండడం గమనార్హం.

పరిశుభ్రత పాటించాల్సిందే..

సీజనల్ వ్యాధులు, డెంగీ, వైరల్ ఫీవర్ వంటి విషజ్వరాలను అడ్డుకోవాలంటే నగర ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కేఎంసీ అధికారులు సూచిస్తున్నారు. ఇళ్ల చుట్టూ, బాల్కనీలు, పూలకుండీలు, పాత టైర్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

హాట్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి..

నగరంలో 15 రోజుల్లో వరుసగా డెంగీ కేసులు నమోదు కావడంతో అధికారులు గత నాలుగేళ్లల్లో నమోదైన కేసుల వివరాల ఆధారంగా హాట్‌స్పాట్లను గుర్తించారు. నగరంలో 18 డివిజన్‌లలో 22 హాట్‌స్పాట్లు ఉన్నట్లు తేల్చారు. 47వ డివిజన్‌లో 4, 48లో 2, 59, 60, 57, 58, 38, 40, 41, 17, 18, 26, 28, 29, 1, 6, 8, 15 డివిజన్లలో ఒక్కొక్కటి చొప్పున హాట్‌స్పాట్లు ఉన్నట్లు గుర్తించి ఈ ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాలు చేపడుతున్నారు. డెంగీ కేసులు నమోదైన ఇంటి చుట్టూ 60 ఇళ్లలో పైరత్రమ్ స్ప్రే, మలథియాన్‌తో ఫాగింగ్ చేస్తున్నారు. వీటితో పాటు టిమోపాస్ స్ప్రే చేయిస్తున్నారు. టిమోపాస్ స్ప్రే చేసే బృందాల సభ్యులు ఇళ్ల చుట్టు పక్కల నిల్వ ఉన్న నీటిని పడబోయిస్తున్నారు.

చెరువును తలపిస్తున్నాయ్..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 16వ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల పాఠశాల పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మురుగునీరు నిలిచి నివాసులు, విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. సరైన శానిటేషన్ పనులు చేపట్టక పోవడంతో వాన నీరు, మురుగునీరు తోడై దుర్వాసన వస్తోందని, విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు, విద్యార్థులు పేర్కొంటున్నారు. మురుగునీరు నివాసాల్లోని బోరింగ్ నీటితో కలవడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని, సమస్యపై వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇకనైనా మంత్రి తుమ్మల చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి నిల్వలతో గురుకుల పాఠశాల పరిసరాలు

పేదవాడి ఆత్మగౌరవం రేషన్‌కార్డు

కామేపల్లి: ప్రతీ పేద కుటుంబం గుర్తింపు, ఆకలి తీర్చే ఆయుధం రేషన్ కార్డు అని, అర్హులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ముచ్చర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తహసీల్దార్ సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పేదలకు మంజూరైన 1,412 రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డు ఇచ్చి ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, దళారులను నమ్మకుండా నేరుగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.రేషన్‌కార్డులతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, ఇల్లెందు ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబయాదవ్, తోటకూరి శివయ్య, మద్దినేని రమేశ్ బాబు, రెడబోతు గోపీరెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, ధరావత్ అనురాధ, దొడ్డ వేణు, కొమ్మినేని శ్రీనివాసరావు, దేవండ్ల నాగేశ్వరరావు, ఉప్పుగండ్ల వీరభద్రరావు, చల్లా నాగేంద్రబాబు, సురభి వీరన్న తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

వరద విపత్తు నివారణకు ముందస్తు చర్యలు



రక్షణ సామగ్రిని పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంరూరల్: మున్నేరుకు వరద విపత్తు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరద బాధితులను కాపాడేందుకు అవసరమైన వాహనాలు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డుల్లో ప్రతీ వార్డుకు సెక్టోరియల్ అధికారిని, ఫీల్డ్ ఆఫీసర్లను నియమించడంతో పాటు తక్షణ సాయంగా ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్, తహసీల్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామని, ఆపద సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 95156 85414 లేదా 83319 30583కు ఫోన్ చేయాలని సూచించారు. అవసరాన్ని, పరిస్థితిని బట్టి ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్‌లను కూడా ఉపయోగించనున్నట్లు తెలిపారు.

కేఎంసీ సమాచారం..

● రోడ్లు ఆక్రమించిన వారికి నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారికి కేఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. రోడ్లపై ఎలాంటి వ్యాపారాలు నిర్వహించొద్దని, రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, బండ్లను వెంటనే తొలగించాలని ఆర్డీఓ కార్యాలయం నుంచి సరితాక్లీనిక్ రోడ్డు వరకు గల వ్యాపారులకు నోటీసులు అందించారు. లేకుంటే కేఎంసీ ఆధ్వర్యాన వాటిని తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యంగా రోడ్లపై ఎవరూ వ్యాపారాలు నిర్వహించొద్దని సూచించారు.

● ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి..

ట్రేడ్ లైసెన్సులు లేకుండా వ్యాపారులు చేస్తున్న వారికి కేఎంసీ అధికారులు దుకాణాలను పరిశీలించి నోటీసులు జారీ చేశారు. రెన్యువల్ చేసుకోని వారు వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని, కొత్తగా లైసెన్స్ తీసుకోవాల్సిన వారు దుకాణం కొలతలు ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఫీజు చెల్లించాలని సూచించారు.

● కమిషనర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నేతలు..

సత్తుపల్లి, మధిర నుంచి డిప్యూటేషన్‌పై కేఎంసీకి వచ్చిన ఇద్దరు ఉద్యోగుల డిప్యూటేషన్ రద్దు చేయడంపై టీఎన్జీవోస్ నేతలు మంగళవారం కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిశారు. ఇద్దరిని కేఎంసీలో డిప్యూటేషన్ కొనసాగించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు కమిషనర్‌ను కోరారు.

నీళ్లల్లో మొక్కలు నాటి నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 16వ, 19వ డివిజన్లు శ్రీరాంనగర్ రోడ్డు నంబర్ 13లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై ఇళ్ల ముందు, రోడ్లపై నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. దీంతో మంగళవారం స్థానికులు సీపీఐ ఆధ్వర్యాన మొక్కలు నాటుతూ నిరసన తెలిపారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న అసిస్టెంట్ కమిషనర్, శానిటరీ సూపర్‌వైజర్లతో సీపీఐ నాయకులు మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, సీపీఐ వన్‌టౌన్ కార్యదర్శి వరద నరసింహారావు, సీపీఐ నాయకులు, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ ఆధ్వర్యాన స్థానికులు కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి వివరించగా.. సానుకూలంగా స్పందించడంతో నిరసన విరమించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశ్, త్రీటౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, నాయకులు నాగేశ్వరరావు, కొండయ్య, రవి, రాంబాబు, కల్‌నాయక్, రంగయ్య, స్థానికులు ఉన్నారు.



మొక్కలు నాటుతూ నిరసన తెలుపుతున్న మహిళలు

విద్యా సేవా పురస్కారం అందజేత

కూసుమంచి: మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన బుర్రా ఉపేందర్‌కు ఏపీలోని కమ్యూనిటీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యాన బాలబాట కార్యక్రమంలో భాగంగా విద్యా సేవా పురస్కారాన్ని అందజేశారు. గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ స్వర్ణలత ఈ పురస్కారాన్ని అందజేశారు. పలువురు విద్యార్థులకు మార్గదర్శకం చేసి వారిని వివిధ పాఠశాలలు, వసతిగృహాల్లో చేర్పించినందుకు ఈ పురస్కారం అందజేసినట్లు ఉపేందర్ తెలిపారు.

వర్షం బీభత్సం..

● కూసుమంచి: కూసుమంచి మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పలు చెరువులు అలుగు పారగా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే, జీళ్లచెరువులోని మందలు కాలనీ నీట మునగడంతో ఎంపీడీఓ రాంచందర్‌రావు పరిశీలించారు. అంతేకాక నేలపట్ల, జీళ్లచెరువు, తురకగూడెం, కూసుమంచి, నర్సింహులగూడెంల్లో నీట మునిగిన పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఏఓ వాణి పరిశీలించి 700 ఎకరాల్లో పంట మునిగిందని అంచనా వేశారు.

● తిరుమలాయపాలెం: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షంతో తిరుమలాయపాలెం మండలంలోని పలు చెరువులు అలుగులు పారుతున్నాయి. మేడిదపల్లి-సుబ్లేడు మధ్య చప్టాపైకి నీరు చేరి రాకపోకలు నిలిచిపోగా, బీరోలు-బంధంపల్లి, బచ్చోడు పెద్ద చెరువు అలుగుతో బచ్చోడు, హస్నాబాద్ రాకపోకలు ఇబ్బందిగా సాగాయి. ఈమేరకు రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం కావడమే కాక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద పరిస్థితిపై బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు.



కూసుమంచి: జీళ్లచెరువులో నీట మునిగిన ఓ ఇంటి ప్రాంగణం

☛ ఉపాధ్యాయుల జాబితాలు సరిచేయాలి

ఖమ్మం అర్బన్: త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాల్లోని లోపాలను సరిచేయాలని పీఆర్టీయూ ఖమ్మం అర్బన్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావుకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1989 డీఎస్సీకి చెందిన వారి పేర్లు కూడా జాబితాలో ఉన్నాయని, అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అట్టి పేర్లను తొలగించి సరిజాబితాలు రూపొందించాలని కోరారు.

☛ యువకుడి అదృశ్యంపై కేసు

రఘునాథపాలెం: రఘునాథపాలెంకు చెందిన యువకుడు యుగేందర్ కానరాకుండా పోవడంతో ఆయన కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. గత నెల 17న వరంగల్ వెళ్తున్నట్టు చెప్పిన యుగేందర్ తిరిగిరాలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

☛ కలశ యాత్రకు తరలిరావాలి

కామేపల్లి: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టినయాదవ రెజింగ్ లా కలశ యాత్రను జయప్రదం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పండితాపురంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 కలశ యాత్ర ఖమ్మం జిల్లాకు చేరుకుంటుందని, యాదవులు పాల్గొన్నాలని కోరారు. బ్రహ్మయ్య, నాగేశ్వరరావు, అశోక్, చంద్రయ్య, వీరబాబు, సత్యం, నాగరాజు పాల్గొన్నారు.

☛ పెన్షన్లు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని 32 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లోని పెన్షనర్లకు జూలై పెన్షన్లు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రవికుమార్‌లు డిమాండ్ చేశారు. సత్వరమే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పెన్షన్లు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

☛ రెజొనెన్స్ శ్రీనివాసనగర్‌లో కంటి వైద్యశిబిరం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్ రెజొనెన్స్ పాఠశాలలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు రెజొనెన్స్ డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.


☛ బీజేపీ హర్‌ఘర్ తిరంగా యాత్ర



యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నేలకొండపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యాన చేపట్టిన హర్‌ఘర్ తిరంగా యాత్ర విజయవంతమైంది. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన బైక్ ర్యాలీ నిర్వహించి వందే మాతరం నినాదాలు చేశారు. నాయకులు రవికుమార్, మన్నె కృష్ణారావు, గోవిందరావు, జ్ఞానరత్నం, షర్ఫొద్దున్, పి.దివాకర్, హర్ష, శేషగిరి, లక్ష్మీనారాయణ, అప్పారావు, ఉదయ్, గిరి, సూరిబాబు, క్రాంతి, నాగేశ్వరరావు, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

☛ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యాన ఖమ్మంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల వద్ద ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బైక్ ర్యాలీని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి ప్రారంభించి మాట్లాడారు. యువతలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదనపు డీఎంహెచ్ఓ పి.వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధ్యాపకులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఉద్యోగులు సునంద, చెంచు రత్నయ్య, పిచ్చయ్య, కోటయ్య, జానీమియా, భాస్కర్‌రావు, రాజేశ్వరరావు, డి.సత్యకుమార్, నాగయ్య, మహమ్మద్ అలీ, వీరయ్య, రామకృష్ణ, ఎ.శంకర్, భానుప్రకాష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు

☛ రిజర్వేషన్ అమలు చేయాలని నిరసన

తిరుమలాయపాలెం: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యాన మంగళవారం తిరుమలాయపాలెంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని తీర్మానం చేసినప్పటికీ అమలు కావడం లేదని, గవర్నర్ ఈ బిల్లుపై సంతకం చేసి ఆమోదించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటుందని, రానున్న కాలంలో బీసీలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మద్దినేని శ్రీనివాస్, ముత్తయ్య, నాగేశ్వరరావు, స్వామి, వెంకట్రావు, మంగతాయి, మహేందర్, రామకృష్ణ, వెంకన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

☛ ఏఐటీయూసీలో చేరిన మున్సిపల్ కార్మికులు



కండువా కప్పి ఆహ్వానిస్తున్న క్లైమెంట్, నర్సింహారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు చేరగా.. సంఘ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ సంఘ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షురాలు సీహెచ్. సీతామహాలక్ష్మి పాల్గొనగా.. బుర్రి ఉపేందర్, జి.మహేష్, ఐ.వెంకన్న, గుండె జానకిరాములు, తాళ్లపల్లి రాములు తదితరులను కన్వీనింగ్ కమిటీగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నాగేంద్రబాబు, బాబురావు, యశోద, బీవీ చారి, కోలిక పొంగ ముత్తయ్య పాల్గొన్నారు.

☛ 'వికాస్' విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వెజిటబుల్ మార్కెట్, పోలీస్ స్టేషన్, లైబ్రరీ, ఫైర్ స్టేషన్, ట్యాంక్ బండ్, పోస్టాఫీస్ తదితర ప్రాంతాలను సందర్శించినట్లు వికాస్ స్కూల్ కరస్పాండెంట్ వై.లావణ్య తెలిపారు. విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని పెంచేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సంక్షిప్తంగా..

☛ మనువాదాన్ని ప్రవేశపెట్టడమే బీజేపీ లక్ష్యం

ఖమ్మంరూరల్: దేశంలో మరోసారి మనువాదాన్ని ప్రవేశపెట్టమే బీజేపీ లక్ష్యమని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ అన్నారు. వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన కేవీపీఎస్ పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ బీజేపీ పబ్బం గడుపుకుంటోందని, దళితులంతా ఏకమై బీజేపీ ఆగడాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. దళితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పి. సత్యనారాయణ, కె.శ్రీను, మహేందర్, జానకిరాములు, మామిడాల ఉపేందర్, రాము, నాగరాజు, ఎ.వరకుమార్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

☛ నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా కన్వీనర్‌గా ఖమ్మం సారథినగర్, గణేష్‌నగర్ ప్రాంతానికి చెందిన కొరకొప్పు డేవిడ్ నియమితులయ్యారు. మంగళవారం ఖమ్మం మామిళ్లగూడెంలోని ఆ సంఘ కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ నకిరికంటి సంజీవరావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ.. సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఈమేరకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భద్రు, బహుజన నాయకులు రవిచంద్ర, కిషన్, వెంకటేశ్వర్లు అభినందించారు.

☛ 'ఎస్‌బీఐటీ'లో అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం, టెక్నోజెన్ సంయుక్తంగా విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక, ఇన్సూరెన్స్ రంగాలపై అవగాహన కల్పించినట్లు ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, టీపీఓ ఎన్.సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

☛ విద్యార్థి విప్లవ పతాకం 'ఏఐఎస్ఎఫ్'

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ, మాజీ రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్ బీ.జీ.క్లైమెంట్, ఓరుగంటి శేషగిరిరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికల రామకృష్ణ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ 90 ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, శాంతినగర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల ఎదుట అరుణ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడగా.. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు చేగ్రోలు ఇంద్రసేన, జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శులు, నాగులమీరా, మధు, శివ, నాయకులు మనోజు, సాయి, చైతన్య, గోపి, ఆకాష్, సంతోష్, శ్రీకాంత్, సందీప్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

☛ జర్నలిస్టుల కొవ్వొత్తుల ప్రదర్శన



నివాళులర్పిస్తున్న టీజేఎఫ్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ఇజ్రాయిల్ సైనిక దాడుల్లో మరణించిన జర్నలిస్టులకు సంతాపం ప్రకటిస్తూ నగరంలో టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యాన మంగళవారం రాత్రి జర్నలిస్టులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించింది. ఈ సందర్భంగా టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు మాట్లాడుతూ.. వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తున్నారనే నెపంతో ఇజ్రాయిల్ పాలస్తీనాలోని జర్నలిస్టుల శిబిరంపై దాడి చేసిందని, ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకుని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీజేఎఫ్ నాయకులు శెట్టి రజినీకాంత్, ఉదయ్, మందుల ఉపేందర్, టీఎస్ చక్రవర్తి, నాగరాజు, గుద్దేటి రమేష్ బాబు, యల్లమందల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


☛ ఆహ్వానం మేరకే ర్యాలీలో పాల్గొన్నాం..

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నగరంలో జరిగిన పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో తమ పాఠశాలల విద్యార్థులు విద్యార్థి సంఘాల ఆహ్వానం మేరకే పాల్గొన్నారని ఖమ్మం ప్రైవేటు విద్యాసంస్థల బాధ్యులు ముజ్వా శ్రీనివాసరావు, ఐవీ రమణారావు, రవిమారుతి ముదిరెడ్డి, వీరారెడ్డి, గుర్రం కాంతారావులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల శిక్షణ, సమగ్రాభివృద్ధికి మాత్రమేనని, ఏ రాజకీయ, మత, పక్షపాత కార్యక్రమాల్లో పాల్గొనటం లేదని స్పష్టం చేశారు.

☛ అవెన్యూ ప్లాంటేషన్ పనుల్లో నిర్లక్ష్యం వద్దు

నేలకొండపల్లి: అవెన్యూ ప్లాంటేషన్ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని డీఆర్‌డీఓ అదనపు పీడీ శిరీష అన్నారు. మండలంలోని రాజేశ్వరపురం, అమ్మగూడెం పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులను మంగళవారం పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులు వెంటనే ప్రారంభించి రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. నర్సరీలో మొక్కల సంరక్షణ బాధ్యతగా అని, ప్రతీ మొక్కకు ఒక లెక్క ఉండాలన్నారు. మండలానికి ఇచ్చిన టార్గెట్ 70 వేల మొక్కలు కాగా.. వాటిలో 15 వేలు అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు, 7,100 రీప్లేస్‌మెంట్ మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అవెన్యూ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, టెక్నికల్ అసిస్టెంట్ జి.నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

☛ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న కార్పొరేటర్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం 46వ డివిజన్ పరిధిలోని జూబ్లీపుర, సారథినగర్‌లలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులైన బానోతు మంగమ్మకు రూ.35,500లు, మిడిదొడ్డి రాజయ్యకు రూ.37,500లు, కొంగర శ్రీశైలంకు రూ. 20వేల చెక్కులను కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, లక్ష్మణ్, నాగేశ్వరరావు కృష్ణయ్య, ఉప్పలయ్య, బి.నాగేశ్వరరావు బీరేష్, రామకృష్ణ, ఆంజనేయులు, నరసయ్య, సంతోష్, ఉపేందర్ పాల్గొన్నారు.